# ఆప్యాయత

-కోలపల్లి ఈశ్వర్

“రండండీ..రండి..” ఆప్యాయంగా ఆహ్వానించాడు ఆనందరావ్.

ఆ ఆప్యాయతకి మురిసిపోతూ ఇంట్లోకి ప్రవేశించాడు పాపారావ్.

“అలా కూర్చోండి” ఆయన చేతిలోని గొడుగునందుకుంటూ సోఫా చూపించాడు ఆనందరావ్.

పాపారావ్ - మెత్తటి ఆ సోఫాలో దర్జాగా కూర్చుని కండువాతో ముఖం తుడుచుకుంటుంటే “ఎండనపడి వచ్చారు..మజ్జిగ తీసుకోండి” అన్నాడు ఆనందరావ్.

ఆ ఆప్యాయతకి చలించిపోతూ “వద్దులే..మంచినీళ్లిప్పించు..చాలు..” అన్నాడు మొహమాటంగా.

“భలేవారే..మంచినీళ్లతో దప్పికేం తీర్తుంది? ఈ ఎండాకాలంలో మజ్జిగే బెస్టు..” అని నవ్వి “శారదా!” అంటూ లోపలికి కేక వేశాడు ఆనందరావ్.

ఓ అరనిముషంలో శారద వచ్చిందక్కడికి.

“మీరా బాబాయ్‌గారూ! బాగున్నారా?” అంటూ భుజం నిండుగా కొంగు కప్పుకుని, వినయంగా పలకరించింది.

“ఆ బాగున్నానమ్మా! మీరంతా బాగున్నారా?” అన్నాడు పాపారావ్ - ఆమె వినయానికి సంతోషపడుతూ.

“మీ దయవల్ల..” అంది శారద.

“ఆ నాదేముందమ్మా..భగవంతుడు..అవునూ! నాకు కబురు చేశారట దేనికి?” అనడిగాడు ఆనందరావు వైపు తిరిగి పాపారావ్.

“చిన్న పనుంది లెండి” అని ముసిముసిగా నవ్వి.

“అంకుల్‌గారికో గ్లాసుడు మజ్జిగ పట్రా..నిమ్మపండు పిండు..” అంటూ భార్యకు పురమాయించాడు ఆనందరావ్.

చల్లటి మజ్జిగ తాగి సేదతీరేక - పాపారావ్ తన భుజానికున్న సంచీని ఒళ్లోకి తీసుకుని, దాన్ని విప్పబోయాడు.

“ఇప్పుడేగా సేదతీరేరు..ముందు ఏవైనా కబుర్లు చెప్పండంకుల్” అన్నాడు ఆనందరావ్ పళ్లికిలిస్తూ.

“అవును బాబాయ్‌గారూ! ఓ పదిహేను నిముషాల దాకా ఏవైనా కబుర్లు చెప్పండి..” అంది శారద తనుకూడా - కొంచెం దూరంగా కుర్చీ జరుపుకుని కూర్చుంటూ!

మొగుడూ పెళ్లాలిద్దరూ ఎంతమంచివాళ్లు!

తనంటే ఎంత అభిమానం!

ఆ ఇద్దరి ఆప్యాయతకీ పరవశించిపోతూ - “ఇంతకీ నన్ను పిలిపించింది ఎందుకో చెప్పనేలేదు...” అన్నాడు పాపారావ్. సోఫాలో రిలాక్స్‌డ్‌గా వెనక్కివాలుతూ.

“ఇంకెందుకూ, మనసారా మీ కవిత్వం వినడానికే!” అన్నాడు ఆనందరావు.



బోలెడంత ఆశ్చర్యంగా అనిపించింది పాపారావ్‌కి.

తనను పిలిపించుకుని తన కవిత్వం వినడమంటే...! తన జీవితంలో ఇలాంటి అవకాశం తనకి ఎప్పుడూ కలగలేదు - మళ్లీ అనుకున్నాడు.

‘పిలిపించుకుని..మరీ...!’

“నిజంగానా?” అన్నాడు ఆనందంగా.

“మీతో అబద్ధాలాడతామా అంకుల్?”

“మీతో పరాచికాలా బాబాయ్‌గారూ..”

ఇద్దరూ ఆయనకేసి ‘ప్రేమ’గా చూశారు.

“మరైతే ఆలస్యం దేనికి?” అంటూ ఆయన తన సంచీని విప్పబోతుంటే.

“అప్పుడే వద్దంకుల్! ముందు కాసేపు కబుర్లు చెప్పమన్నాగా..” అన్నాడానందరావ్.

అంతలో ఆ ఇంటిముందో ఆటో ఆగింది. అందులోంచి ఓ అరడజను శాల్తీలు క్రిందకు దిగాయ్.

“వాళ్లంతా మా చుట్టాలంకుల్! నాలుగురోజులైంది దిగబడి..సినిమా కెళ్లి. టిక్కెట్లు దొరకలేదని వెనక్కొస్తున్నట్టుగా ఇందాక ఫోన్ చేశారు. తిరిగొచ్చారు. వాళ్లు లోపలికి రాగానే. మీరు మీ కవిత్వం మొదలుపెట్టండి..” అన్నాడు ఆనందరావ్ కసిగా.

‘వార్నీ! మీ ఆప్యాయతకు అసలు కారణం ఇదా?’ అనుకుని కృంగిపోయాడు పాపారావ్.

‘తన పిచ్చిగాకపోతే - ఏదో ఒక బలీయమైన కారణం లేనిదే తనలాంటి కవిమీద అంత ఆప్యాయత ఎవరు మాత్రం ఎందుకు చూపిస్తారు?!’ అనుకుని జీవంలేని నవ్వొకటి నవ్వుకున్నాడు పాపారావ్.

★